క్లుప్తంగా

రెండో రోజు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

నందిగామ: స్థానిక ముక్కోటి మహా మండపంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రెండో రోజైన మంగళవారం స్వామి వారికి విశేష పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



పెనుగంచిప్రోలు: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గ్రామంలో శ్రీగోపయ్య సమేత తిరుపతమ్మవారి గ్రామోత్సవం సోమవారం అర్ధరాత్రి దాటే వరకు వైభవంగా సాగింది. ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారిని రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఏఈఓ ఉమాపతి, ధర్మకర్తలు కోలా రామారావు, ఆదిమూలం నరసింహారావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్రాంతి జూదాలను అరికట్టాలి

జగ్గయ్యపేట అర్బన్: రానున్న సంక్రాంతి పండుగ సందర్భంగా జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలో జూదాలు అరికట్టేందుకు తగిన ఆదేశాల జారీ చేయాలని పేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్‌కు పట్టణానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన ఫిర్యాదు కాపీలను మీడియాకు విడుదల చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారు సంప్రదాయ క్రీడలను మాత్రమే నిర్వహించుకోవాలని, ఎలాంటి జూదాలు ఆడినా, ఆడించినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. అయినప్పటికీ గతంలో అధికారులు పట్టించుకోకపోవడం వలన ఘర్షణలు తలెత్తాయని తెలిపారు. వచ్చే సంక్రాంతి పండుగ సందర్భంగా ఎటువంటి జూదాలు నిర్వహించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు



పెనుగంచిప్రోలు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని సర్పంచ్‌వేల్పులపద్మకుమారి తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో, పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు. కార్యదర్శి శ్యామ్, ఉపసర్పంచ్ పాపారావు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ముండ్లపాడులో సర్పంచ్ గూడపాటి లావణ్య ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, సొసైటీ అధ్యక్షుడు రవికుమార్, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

ఉచితంగా పాదరక్షలు ఇవ్వడం అభినందనీయం



ముక్త్యాల (జగ్గయ్యపేట అర్బన్): గ్రామంలో ఉన్న కేసీపీ సిమెంట్స్ సహకారంతో కుష్టు, బోధ వ్యాధి గ్రస్తులకు కస్టమైజ్డ్ ఫుట్‌వేర్ నిమిత్తం ఫుట్ కేర్ యూనిట్‌కు రూ.4 లక్షలు అందజేశారు. మంగళవారం కేసీపీ కార్యాలయంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ మధుసూదనరావు, హెచ్‌ఆర్ హెడ్ జీఎస్.శ్రీనివాస్ చెక్‌ను లెప్రా సొసైటీ స్టేట్ కో ఆర్డినేటర్ మామిడి రాధికకు ఇచ్చారు. రాధిక మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా కేసీపీ సిమెంట్స్ వారి నుంచి జిల్లా వ్యాప్తంగా కుష్టు, బోధ వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు ఉచితంగా అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కేసీపీ సీఎస్ఆర్ ప్రతినిధి రాఘవేంద్రరావు, లెప్రా సొసైటీ శ్రేయస్సు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కంచికచర్ల: స్థానిక చెరువుకట్ట సమీపంలోని నారిశెట్టి శ్రీనివాసరావు ఇంటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు మంగళవారం తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అందజేస్తారు. సమస్యలు తెలుసుకుంటారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

నేటి తరానికి సావిత్రీబాయి పూలే ఆదర్శం

- ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి
- సావిత్రీబాయి చిత్రపటాలకు నివాళులర్పించిన నేతలు



పేటలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను, బీసీ సంఘం నేతలు



బాలుర హైస్కూల్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం మాధవీలత, పాల్గొన్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



వత్సవాయిలో మహిళా ఉపాధ్యాయినులను సన్మానించిన నిర్వాహకులు



గండేపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం రామకృష్ణ

జగ్గయ్యపేట అర్బన్: సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి పట్టణంలోని పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్, బాలుర హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల, వాగ్దేవి మహిళా జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ మహిళా అక్షరాస్యతకు సావిత్రీబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. ఎస్‌ఎఫ్‌ఐ పేట మండల అధ్యక్షుడు కె.రాజు, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం.వాణి, బాలుర హైస్కూల్ హెచ్‌ఎం.మాధవీలత, వాగ్దేవి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్ , ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్.నాగేశ్వరరావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి ఎస్.నాగమణి, యూటీఎఫ్ నాయకులు హనుమంతరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వెంకట్, రాజా, కల్యాణి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక

పెనుగంచిప్రోలు: మహిళా చైతన్యానికి ప్రతీక సావిత్రీబాయి పూలే అని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పేర్కొన్నారు. సావిత్రీబాయి జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పోరాడిన మహిళా చైతన్యమూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఉప సర్పంచ్ బాడిశ పాపారావు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం కే జలజను ఘనంగా సత్కరించారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చేని కుమారి, బీసీ నాయకులు కల్లూరి శ్రీవాణి, కొలిపాక బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. శివాపురం యూపీ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి నివాళులర్పించి, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

కంచికచర్ల : భారతదేశపు మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని.. ఆమె అడుగుజాడల్లో ఉపాధ్యాయులందరూ నడుచుకోవాలని హెచ్‌ఎం ఎస్ఎస్ ప్రసాద్, కె. రామకృష్ణ తెలిపారు. కంచికచర్ల, గండేపల్లి, మోగులూరు, పెండ్యాల, గనిఆత్కూరు, పరిటాల, గొట్టుముక్కల, గ్రామాల్లోని జిల్లా పరిషత్ హై స్కూల్‌తో పాటు అక్షర స్కూల్‌లో మంగళవారం సావిత్రీబాయి 92వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు హెచ్‌ఎంలు మాట్లాడుతూ ఆనాటి కట్టుబాట్లను ఎదిరించి వెనుకబడిన వర్గాల వారి విద్యాభివృద్ధి కోసం పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

వత్సవాయి: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే జయంతి పీఆర్టీయూ ఆధ్వర్యంలో వత్సవాయి ఎంఈవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు జీ రేవతి, కే సుశీల, ఎస్ గురులక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో పాటు సమానంగా ఉండాలని కోరిన వ్యక్తి సావిత్రిభాయి పూలే అని చెప్పారు. ఆమె పుట్టిన రోజును మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి సుధాకర్, వరుగు శ్రీనివాసరావు, జెడ్పీ వత్సవాయి హెచ్‌ఎం సైదులు, మండల మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ కే లక్ష్మి, సభ్యులు కే త్రినాథ్, బీ బుచ్చిబాబు, కే నాగలక్ష్మి, ఎస్ నరేష్ పాల్గొన్నారు.

నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా పలు పాఠశాలలు, స్వచ్ఛంద సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన వక్తలు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలని, ఇందుకు చదువొక్కటే మార్గమని భావించి, బాలికల కోసం తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలసి పాఠశాలలు స్థాపించడంతోపాటు తానే స్వయంగా పాఠాలు బోధించి దేశంలోనే తొలి ఉపాధ్యాయురాలిగా కీర్తి సాధించారన్నారు. సావిత్రిబాయి పూలే కలలను నిజం చేయాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పలుచోట్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. చందర్లపాడు మండలంలోని రామన్నపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో..

బహుజన సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాలలోని మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. బహుజన సేవా సమితి ప్రతినిధులతో పాటు కళాశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా అక్షరాస్యతకు సావిత్రీబాయి పూలే కృషి -ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: మొట్ట మొదటి బీసీ మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీబాయి పూలే జీవితం బడుగు, బలహీనవర్గాల విద్యావ్యాప్తికి కృషిచేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలో మంగళవారం సావిత్రీబాయి పూలే 192 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విజయవాడ రోడ్‌లోని సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొని సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మొట్ట మొదటి బీసీ మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె జీవితం బడుగు, బలహీనవర్గాల విద్యావ్యాప్తికి కృషిచేసిందని ఆమె సేవలను కొనియాడారు. ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించి పేద వారికి విద్య వజ్రాయుధం అని చాటిచెప్పిన వీరవనిత అన్నారు. 18 వ శతాబ్దం లోనే విద్య ద్వారా సమాజంలోఉన్న అసమానతలను తొలగించాలని సావిత్రీబాయి పూలే దంపతులు ప్రయత్నించారని, మొక్కవోని ఆమె కార్యదీక్ష వలన అప్పటి సమాజంలో హీన స్థితిలో ఉన్న స్త్రీల జీవితాలకు అండ దొరికిందని, భర్త జ్యోతిరావ్ పూలే ప్రోత్సాహంతో స్వయంగా చదువుకున్న సావిత్రీబాయి పూలే దేశంలోనే మహిళ దారిదీపం అయిందని కొనియాడారు. వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు చారుగుండ్ల కొండ, నాయకులు జంగాల వాసు, కొత్త పురుషోత్తం, శ్రీనివాసగౌడ్, విజయ్, సుదర్శన్, పుల్లయ్య, పాటి సాంబ, శ్రీను పాల్గొన్నారు.



మాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి :



పేటలో బాలికల హైస్కూల్లో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వాణి, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు :



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ పద్మకుమారి, నేతలు

పింఛన్ పెంపుతో మరింత భరోసా

ఎమ్మెల్సీ అరుణకుమార్



నందిగామలో పింఛన్లను కౌన్సిల్ సభ్యులతో కలిసి అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌లను పెంచి లబ్ధిదారుల ఆత్మగౌరవంతో పాటు ఆర్థిక భరోసాను కూడా పెంచారని శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణ కుమార్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ కుల మత రాజకీయాలకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌లను అందిస్తున్నారన్నారు. జన్మభూమి కమిటీలు, పార్టీ నాయకులు సూచించిన వారికి పింఛన్‌లు మంజూరు చేసిన ఘనత ఒక్క చంద్రబాబుకే దక్కిందన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందక నానా ఇబ్బందులు పడ్డారని ఆయన గుర్తు చేశారు.

ఇళ్ల ముంగిటకే సంక్షేమ పథకాలు..

గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇళ్ల ముంగిటనే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అరుణకుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థతో మెరుగైన పారదర్శక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వంలో పింఛన్‌లు తీసుకునేందుకు అవ్వాతాతలు పడిన కష్టాలు, అవస్థలు అన్నీ ఇన్నీ కావన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఠంచనుగా ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్‌లు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి చిక్కటి చిరునవ్వుతో పలకరించి పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో, ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ. 250లు పెంచుతున్నారని ఈ ఏడాది పెంచిన రూ. 250లతో కలిపి రూ. 2,750ల పింఛన్‌ను అందించినట్లు చెప్పారు.

4,203 మందికి పింఛన్..

నందిగామ నగర పంచాయతీ పరిధిలో 4,203 మందికి పింఛన్ అందిస్తున్నామని అరుణకుమార్ తెలిపారు. దీనిలో కొత్తగా మంజూరైనవి 141 ఉన్నాయన్నారు. అనంతరం నూతనంగా పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు ఆయన పింఛన్ నగదును అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్‌లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, కమిషనర్ జయరాం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండవ పిచ్చయ్య, మహ్మద్ మస్తాన్, పాములపాటి రమేష్, అమీన్, కౌన్సిల్ సభ్యులు పాకాలపాటి కిరణ్, తానూరి రాము, షేక్ ఖాలిక్, మారం అమరయ్య, యాకుబ్ వలీ, విశ్వనాథపల్లి వాణి, బండారు గంగమ్మ, మందా మరియమ్మ, బాపట్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడం అభినందనీయం





మాట్లాడుతున్న ప్రభుత్వ ప్రభుత్వ విప్ ఉదయభాను ; పాల్గొన్న ప్రజలు

ప్రభుత్వ విప్ ఉదయభాను

ఆటోనగర్ (జగ్గయ్యపేట అర్బన్): పారిశ్రామికవేత్తగా ఉప్పుతోళ్ల కొండలరావు అనేక పరిశ్రమలను స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పించడం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో అమోద ఐరన్ అండ్ స్టీల్ గ్రూప్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం రాత్రి కృతజ్ఞతారాధన వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కృతజ్ఞతకు నిర్వచనం కొండలరావు అన్నారు. పారిశ్రామికవేత్తగా ఆయన నిర్మించిన పలుపరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధికల్పించటం అభినందనీయమన్నారు. చిన్నారులు, యువకులు ఆలపించిన గీతాలు, నృత్యాలు అలరించాయి. ఆమోద గ్రూఫ్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ ఉప్పుతోళ్ల కొండలరావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మాజీమంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మె ల్యేశ్రీరాం తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, పణితి విజయకుమార్,మున్సిపల్ కౌన్సిలర్లు, పాస్టర్ పి.సామ్యూల్, చర్చిల పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం ప్రాధాన్యం

ఎమ్మెల్సీ అరుణకుమార్



ఏఎంసీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గ చరిత్రలో ముస్లిం మైనార్టీలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కట్టబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 5న అట్టహాసంగా నిర్వహిస్తున్నామన్నారు. చైర్మన్‌గా మహ్మద్ మస్తాన్, వైస్ చైర్మన్‌గా నల్లమల్లి మురళీలతో పాటు పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహ్మద్ మస్తాన్, నల్లమల్లి మురళి, ఎండీ అమీన్, వైఎస్ఎన్ ప్రసాద్, పాములపాటి రమేష్, అచ్చి శ్రీకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందాలి

వీరులపాడు: విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్యలు పేర్కొన్నారు. స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంఈవో నాగరాజును, ఇన్‌చార్జ్ ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిన చిట్టిబాబులను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని కానీ ఎక్కడ పని చేసినా ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అమర్లపూడి బేబి, సుబ్బారావు, కామా ప్రభాకర్, వెంకట్రావ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్లు అందజేత



ఆస్పత్రిలో రోశయ్యకు పింఛను ఇస్తున్న వలంటీర్



చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కోటేశ్వరరావు

కంచికచర్ల: మండలంలోని గండేపల్లి గ్రామానికి చెందిన నంద్రు వెంకటరత్నం విజయవాడ ప్రభుత్వ చికిత్స పొందుతున్నారు. దీంతో వలంటీర్ బొక్కా కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ వెళ్లి పింఛన్ అందజేశారు. విషయం తెలుసుకున్న వలంటీర్, పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ నగదు అందజేశారు.

నందిగామ: నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ వేడుకలా సాగుతోంది. ఈ నెల నుంచి ప్రభుత్వం పెంచిన మొత్తాన్ని అందిస్తుండటంతో పింఛనుదారుల్లో ఆసక్తితోపాటు ఆనందం తొణికిసలాడింది. పనులకు వెళ్లిన వారు, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి సైతం వలంటీర్లు స్వయంగా వెళ్లి పింఛను మొత్తాన్ని పంపిణీ చేశారు. విజయవాడలోని ఆశోక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందిగామ మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోమటి రోశయ్యకు గ్రామ వలంటీర్ షేక్ అబ్దుల్ రహీం పింఛను పంపిణీ చేశారు.

రహదారుల అభివృద్ధికి కృషి

మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్



సీసీ రోడ్డు, డ్రెయిన్ శంకుస్థాపనలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో రహదారులన్నీ పూర్తిగా అభివృద్ధి చేస్తూ వాటి రూపురేఖలనే మార్చివేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక 5వ వార్డులో వట్టెం సాంబశివరావు వీధిలో నూతనంగా రూ. 6.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, రూ. 4 లక్షల వ్యయంతో డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సాంబశివరావు వీధిలో కొన్నేళ్లుగా మట్టి రోడ్డు వలన కంప చెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. స్థానికులు కౌన్సిలర్ వట్టెం మనోహర్ ద్వారా ఎమ్మెల్యే సామినేని ఉదయభానును కలిసి సమస్యను విన్నవించగా, స్పందించిన మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు చెప్పి అత్యవసర ప్రాధాన్యతనిచ్చి సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్, వైఎస్సార్ సీపీ నాయకులు సిలాంబరెడ్డి, లక్ష్మారెడ్డి, కంట్రాక్టర్ భవానీశంకర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



వేదాద్రి (జగ్గయ్యపేట): జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందుతుందని సర్పంచ్ గుడారు పేరయ్య తెలిపారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా మంగళవారం గ్రామ కార్యాచరణ ప్రణాళికను చిత్రం రూపంలో ప్రదర్శించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని, ప్రజలకు తాగునీటి కష్టాలు తొలగిపోతాయన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆనంగి శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కో-ఆర్డినేటర్స్ లక్ష్మి, కిషోర్, లక్ష్మణరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజశేఖర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.